సాక్షి ఒడిశా

సోమవారం । 31 । జూలై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.8,98,236లు, బంగారం 11.8 గ్రాములు, వెండి 105.85 గ్రాములువచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రతిభకు పదును

- 8లో



ఆగస్టు 1నుంచి ఆందోళనకు సిద్ధం

- 8లో

న్యూస్‌రీల్

ప్రజల భద్రతకే ప్రాధాన్యం: డీఐజీ



పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ చరణ్‌సింగ్ మీనా

కొరాపుట్: ప్రజల భద్రతకే సిబ్బంది అధిక ప్రాధాన్యం ఇవ్వాలని దక్షిణాంచల్ రేంజ్ డీఐజీ చరణ్‌సింగ్ మీనా పిలుపునిచ్చారు. నవరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి కేంద్రంలో నూతనంగా ప్రారంభమైన పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించాలని, లోతైన దర్యాప్తు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విషయాలపై సూక్ష్మ పరిశీలన ఉండాలన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగితే అనేక నేరాలు ముందుగానే అరికట్టవచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్.సుశ్రీ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రవా సభ్యులు



మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం

పర్లాకిమిడి: వనమహోత్సం ముగింపు సందర్భంగా పట్టణంలోని బిజూ పట్నాయక్ జంక్షన్, ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో ప్రవా స్వచ్ఛంద ప్రతినిధులు అట్టాడ అప్పారావు ఆదివారం వివిధ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గ్రీన్ గజపతి–క్లీన్ గజపతి' నినాదంతో హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న పర్లాకిమిడికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సహకారంతో పట్టణంలోని ఎస్‌కేసీజీ కళాశాల, ఆదర్శ పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్లాస్టిక్ నిర్మూలనకు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

జయపురం: పట్టణ పోలీసులు 60కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారని సదర్ పోలీసు అధికారి ఈశ్వరతండి తెలిపారు. నిందితులు మల్కన్‌గిరి జిల్లా కలిమెలకు చెందిన ఎస్.భైరాగి కుమారుడు ఎస్.సాహెబ్‌కుమార్(33), బన్సీ పాయక్ కుమారుడు రాహుల్ పాయక్(26), లబ నాయిక్ కుమారుడు మహేశ్వర నాయక్(19)గా గుర్తించామన్నారు. విజయవాడ–రాంచీ 326 జాతీయ రహదారి టంకువ ఫారెస్ట్ చెక్‌గేట్ సమీపంలో శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ నవీన్‌కుమార్ టొప్పో, సిబ్బంది.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకుల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేశారు. అందులో గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. తూకం వేయగా 60కిలోలు ఉన్నట్లు వెల్లడించారు. పట్టుబడిన సరుకు విలువ రూ.6 లక్షలు ఉంటుందన్నారు. నిందితులు మల్కన్‌గిరి జిల్లాలోని మారుమూల గ్రామాల్లో దీనిని కొనుగోలు చేసి, విశాఖపట్నం తీసుకువెళ్లి, విక్రయించేందుకు తరలిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం. నిందితుల నుంచి గంజాయితో పాటు 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఐఐసీ వివరించారు.

ఓఎస్ఎస్‌సీలో షరా మామూలే..!

- ఒడిశా స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్షలపై కొనసాగుతున్న ఆరోపణలు
- యూఎల్‌బీ అకౌంటెంట్ పరీక్షలో స్వల్ప ఉద్రిక్తత
- భద్రక్‌లో ప్రశ్న పత్రం లీక్ అయ్యిందంటూ వదంతులు



కళాశాలలో బైఠాయించి, నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

భువనేశ్వర్: ఒడిశా స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న పరీక్షల్లో వివదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన జూనియర్ ఇంజినీర్ పరీక్షలో ప్రశ్న పత్రం వ్యవహారం రాష్ట్రాన్ని కుదిపేసింది. దీనికి సంబంధించి పోలీసుశాఖ దర్యాప్తు చేపట్టి, బీహార్‌కు చెందని ప్రధాన నిందితుడితో పాటు 9మందికి పైగా నిందితులను అదుపులోకి తీసుకుంది. ఈ వ్యవహారం ముగియక ముందే తాజాగా అటువంటి ఘటనే ఎదురైంది. భద్రక్ అటానమస్ కళాశాలలో ఆదివారం జరిగిన ఒడిశా స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఓఎస్ఎస్‌సీ) యూఎల్‌బీ అకౌంటెంట్ పరీక్షలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ కేంద్రంలో పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయగా, చివరి క్షణంలో ప్రశ్నపత్రం లీక్ అయినట్లు దుమారం రేగింది. ఈ ఆరోపణతో పరీక్ష రద్దు చేయాలని పలువురు అభ్యర్థులు పట్టుబట్టారు. కొందరు పరీక్ష హాలు నుంచి బయటకు వచ్చి ప్రశ్న పత్రం లీకేజీ నినాదంతో గందరగోళం సృష్టించడంతో ఈ పరిస్థితికి దారితీసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేంద్రంలో ఎటువంటి లీకేజీ లేనట్లు స్థానిక సబ్ కలెక్టర్ మనోజ్ పాత్రా స్పష్టంచేశారు. నిబంధనల ప్రకారం పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. లీకేజీ ఆరోపణకు సంబంధించి అన్ని రకాల తనిఖీలకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీసీటీవీ, వీడియో రికార్డింగు పూర్తిస్థాయిలో జరిగినట్లు పేర్కొన్నారు. ఎటువంటి పరిశీలన అయినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నట్లు వివరించారు.

స్వల్ప జాప్యం..

ఈ కేంద్రంలో 699మంది పరీక్షకు హాజరయ్యారు. దాదాపు 60మంది అభ్యర్థులు హాజరు కాలేదు. హాజరైన వారికి సుమారు 15నిమిషాలు ప్రశ్నపత్రం ఆలస్యంగా ఇచ్చినట్లు సబ్ కలెక్టర్ అంగీకరించారు. పంపిణీకి ముందే ప్యాకెటు తెరిచి ఉన్నట్లు తమ దృష్టిలో పడినందున లీకేజీ అయినట్లు భావిస్తున్నట్లు అభ్యర్థులు వివరణ ఇచ్చారు.

ప్రిన్సిపల్ నిరాకరణ..

అభ్యర్థుల ఆరోపణలను భద్రక్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబోధ్‌చంద్ర మిశ్రా ఖండించారు. పోలీసులు, నోడల్ అధికారుల సమక్షంలో ప్రశ్న పత్రాల ప్యాకెట్ నిబంధనల మేరకు తెరిచినట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో ప్రశ్నపత్రం లీకేజీ ప్రసక్తే లేదని తెలిపారు. కళాశాల సముదాయంలో రెండు గదుల్లో అభ్యర్థులు వాగ్వాదానికి దిగి, పరీక్ష రాయకుండా నినాదాలతో క్యాంపస్‌ను హోరెత్తించారని విచారం వ్యక్తం చేశారు.



పరీక్ష కేంద్రం వెలుపల అభ్యర్థుల నినాదాలు

పాముకాటు మరణాలపై ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు

- 6వారాల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గడువు



భువనేశ్వర్: పాముకాటు మరణాలు పెరగడం, వాటిని నియంత్రించే చర్యలు లేకపోవడంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్‌సీ) కేంద్రం తోపాటు ఒడిశా ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పౌరహక్కుల న్యాయవాది రాధాకాంత త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న కమిషన్.. 6వారాల్లోగా సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరింది. సమగ్ర విపత్కర మరణాలలో పాముకాటు మరణాలు 40శాతం పైగా నమోదవుతున్నాయని పిటీషన్‌లో పేర్కొన్నారు. 2015లో పాముకాటుతో 522 మృతిచెందగా.. 2021లో ఈ సంఖ్య 1,159కి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండింతలు మరణాలు పెరిగినా, చర్యలు లేకపోవడంపై విస్మయం వ్యక్తంచేశారు. ప్రధానంగా ప్రభుత్వం నిర్వహించే ఆరోగ్య సంస్థల్లో పాము(విషం) కాటు నిరోధక మందుల నిల్వల కొరతే దీనికి కారణంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రముఖ వైద్య, ఆరోగ్య సంస్థగా వెలుగొందుతున్న కటక్ ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రి వంటి ప్రముఖ సంస్థల్లో సైతం ఈ మందుల కొరత తాండవిస్తుందని సవివరంగా తెలియజేశారు. అలాగే పాము కాటుకు అనుబంధ చికిత్స ఇతరేతర సౌకర్యాలు లేనట్లు కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లారు. యాంటీ–వీనమ్ మందులు రాష్ట్రంలో బహిరంగ మార్కెట్‌లో అందుబాటులో లేవని స్పష్టం చేయడం విశేషం. పాముకాటు కారణంగా దేశంలో ఏటా సగటున 58వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, వీరిలో 70శాతం బాధితులు 9రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నారన్నారు. ఈ జాబితాలో బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయని వివరించారు. దేశం పాముకాటుతో తీవ్రంగా ప్రభావితమైందని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ఈ కారణంగా మృతుల నివారణ, నియంత్రణకు 2019లో ప్రత్యేక వ్యూహాత్మక కార్యక్రమం ప్రారంభించినా, అమలుకు నోచుకోవడం లేదని పిటిషనర్ తెలియేశారు.

సామాజిక మాధ్యమాలకు అధిక ప్రాధాన్యం



వేదికపై అధ్యక్షుడు జిన్ను హికాక, ఎమ్మెల్యే, నాయకులు

కొరాపుట్: బీజూ జనతాదల్‌లో సామాజిక మాధ్యమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని బీజేడీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు జిన్ను హికాక ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ హాలులో ఆదివారం జరిగిన పార్టీ యువజన, విద్యార్థి విభాగాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో పార్టీ తరుపున సోషల్ మీడియా కన్వీనర్‌ను నియమిస్తున్నట్లు వెల్లడించారు. బీజేడీలో విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో చేరుతున్నారని తెలిపరు. సమావేశంలో కొరాపుట్ ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా సంఘం అధ్యక్షుడు రఘురాం పాడాల్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి, స్వతంత్ర మండలి అధ్యక్షుడు చంద్రశేఖర్ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలాటేందు రంజన్‌శెఠి, పార్టీ పరిశీలకుడు రమాకాంత్ రౌళా తదితరులు పాల్గొన్నారు.



హాజరైన బీజేడీ విద్యార్థి, యువజన సంఘం కార్యకర్తలు

నకిలీ గుట్కా కర్మాగారంపై దాడి



నకిలీ గుట్కా కర్మాగారంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బరంపురం: నగరం మధ్యలోని పెద్ద బజార్ గణేష్ మార్కెట్‌లో చిన్న భవనంలో గత కొద్ది రోజులుగా రహస్యంగా నిర్వహిస్తున్న నకిలీ గుట్కా తయారీ కర్మాగారంపై పోలీసులు దాడి చేశారు. ఇందులో భారీగా నకిలీ గుట్కాతో పాటు యంత్రాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద బజార్‌లో నకిలీ గుట్కా తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఇందులో 1056 కిలోల పాన్ మసాలా, 780కిలోల తయారీ సామగ్రి, యంత్రాలు, లేబుళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు.



నకిలీ గుట్కా కర్మాగారంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సారా బట్టీ ధ్వంసం



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

జయపురం: స్థానిక సమితిలోని బలియ పంచాయతీ నీలాగుడ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీపై జయపురం ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. ఇందులో 80లీటర్ల సారాతో పాటు తయారీకి ఉపయోగించే 1500 లీటర్ల విప్ప సారా ఊట ధ్వంసం చేశామని జయపురం ఎక్సైజ్ అధికారి సంజయకుమార్ కండి తెలిపారు. దీని విలువ రూ.80 వేలకు పైగా ఉంటుందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్‌శాఖ ఫ్లయ్యింగ్ స్క్వాడ్ అధికారి ఖగేశ్వర కొట, రేంజ్ ఏఎస్ఐ ప్రదీప్‌కుమార్ దొళాయి, సిబ్బందితో ఆదివారం ఉదయదం పెట్రోలింగ్ చేపట్టారు. అదే సమయంలో నీలాగుడ ప్రాంతంలో సారా తయారు చేస్తున్న సమాచారం అందింది. వెంటనే దాడి చేయగా, అధికారులను చూసిన తయారీదారులు అక్కడి నుంచి అడివిలోకి పరారయ్యారు. ఈ మేరకు సారాను స్వాధీనం చేసుకొని, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఐఐసీ తెలిపారు. పరారైన నిందితుల కోసం గాలిస్తున్నామని వివరించారు. సారా తయారీని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, దీనిపై ప్రజలు సైతం సహకరించాలని కోరారు.

పూరీలో మరో బాబా మృతి



పూరీ గురుకృపా ఆశ్రమం

భువనేశ్వర్: పూరీ గురుకృపా ఆశ్రమంలో శుక్రవారం జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన మరో బాబా కన్ను మూశారు. దయానిధి బాబా తీవ్రంగా గాయడటంతో ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి దయానిధి తుది శ్వాస విడిచారు. పూరీ బసేలిసాహి లోక్‌నాథ్ రోడ్‌లో ఉన్న గురుకృపా ఆశ్రమంలో మద్యం మత్తులో ఉన్న బాబా విష్ణుదాస్ తోటి బాబా అర్జున్‌దాస్‌తో శుక్రవారం గొడవ పడ్డాడు. ఈ గొడవ ఉగ్రరూపం దాల్చడంతో కర్ర చెక్కతో దాడికి పాల్పడి అర్జున్‌దాస్ తల పగలగొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. అడ్డుకునేందుకు వెళ్లిన బాబా దయానిధి కూడా తీవ్రంగా గాయపడ్డారు. సాయం కోసం కేకలు వేయడంతో స్థానికులు ఆశ్రమానికి చేరుకుని రక్తమోడుతున్న ఆయనను రక్షించారు. సమాచారం అందుకున్న పోలీసులు బాబా విష్ణుదాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. గాయాలు పాలైన బాబా దయానిధిని తొలుత పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో సత్వర ఉన్నత చికిత్స కోసం కటక్ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.

మిట్స్‌లో విద్యార్థి బలవన్మరణం



అస్పత్రి విద్యార్థి మృతదేహం

ప్రీతమ్ ప్రధాన్(ఫైల్)

రాయగడ: పట్టణానికి సుమారు 13కిలోమీటర్ల దూరంలోని భుజొబోల్ గ్రామంలో ఉన్న మజ్జిగౌరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(మిట్స్) కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చరల్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రీతమ్ ప్రధాన్(21) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆదివారం క్లాసులకు సెలవు కావడంతో విద్యార్థులంతా హాస్టల్ లోనే ఉన్నారు. ప్రీతమ్ తోటి విద్యార్థులు బయటకు వెళ్లడంతో మధ్యాహ్నం 12.30గంటల సమయంలో హాస్టల్ గదిలోనే ఉరి వేసుకున్నాడు. బయట నుంచి తిరిగి వచ్చిన వారంతా ఎంత కొట్టినా తెరవక పోవడంతో గది తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే ప్రీతం ఫ్యాన్‌కు వేలాడుతూ శవమై కనిపించాడు. విషయాన్ని కళాశాల యాజమాన్యానికి తెలియజేయడంతో చందిలి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు సిబ్బంది మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రాయగడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. మృతుడిది బరఘడ్ జిల్లాగా గుర్తించి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్ర్య వీరుల విగ్రహావిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి జగన్నాథ సరక

రాయగడ:

పట్టణానికి సమీపంలోని ఏర్పాటు చేసిన పితామహల్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో మహాత్మాగాంధీ, సహీద్ లక్ష్మణ్ నాయక్, ఉత్కళమణి గోపబంధు దాస్ విగ్రహాలను రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక ఆదివారం ఆవిష్కరించారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వితిచంద్ర సాహు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్‌పర్సన్ అనసూయా మాఝి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వరపుత్రుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. దీనివ స్వతంత్ర్య వీరుల, వారి జీవిత చరిత్రలను విద్యార్థులు తెలుసుకొనే అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్నతనం నుంచే దేశభక్తి అలవరుచుకోవాలని సూచించారు.

ఉద్యోగులపై వివక్ష తగదు

- డీపీఆర్ఓ బసంతకుమార్ ప్రధాన్



సమావేశంలో పాల్గొన్న టాటా పవర్ ఉద్యోగులు

రాయగడ:

టాటా పవర్ కంపెనీలో పనిచేస్తున్న సిబ్బందిపై యాజమాన్యం చూపిస్తున్న వివక్ష ఎంతమాత్రం తగదని జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారి బసంతకుమార్ ప్రధాన్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని గాయత్రీ మందిరం ప్రాంగణంలో ఒడిశా విద్యుత్ మజ్దూర్ మహాసంఘం(సౌత్ జోన్) రాయగడ శాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏదైనా సంస్థ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే అందులో పనిచేసే కార్మికులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. నిఖిల ఒడిశా విద్యుత్ మజ్దూర్ మహాసంఘం సాధారణ కార్యదర్శి సత్యవ్రత పరిడా మాట్లాడుతూ మూడేళ్ల క్రితం రాష్ట్రంలో టాటా కంపెనీ పగ్గాలు చేపట్టిందని, అప్పటి నుంచి తమకు కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. ప్రతి నెలా ఆఖరు వారంలో జీతాలు చెల్లించడంతో పాటు ఒకొక్కసారి జీతాలు అందక సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ వైఖరిని యాజమాన్యం వదులుకోవాలని సూచించారు. ప్రతి కార్మికునికి భీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. యాజమాన్యం చెల్లించిన జీతాల కంటే కార్మికుల ఖర్చులే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎటువంటి ప్రమాదకర పరిస్థితుల్లో కూడా తమతో సేవలు చేయించుకుంటున్న టాటా పవర్ యాజమాన్యం ఆ దిశగా సిబ్బందికి మెరుగైన సేవలను అందించడంలో విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మికుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినా, అవి తమకు అందడం లేదన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా న్యాయవాది పద్మనాభ దాస్, గౌరచంద్ర నాయక్ తదితరులు ప్రసంగించారు. సౌత్ జోన్‌కు చెందిన విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఆర్ఓ బసంత ప్రధాన్

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు నేటితో గడువు పూర్తి

రాజాం: రాజాంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు సోమవారంతో గడువు ముగుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31తో రిజిస్ట్రేషన్ గడువుతో పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తవుతుందని పేర్కొన్నారు. ఐటీఐ కళాశాలలోనే మొత్తం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. సివిల్-18, ఫిట్టర్-5, డీజిల్ మెకానిక్ -20, కోపా-30 వరకూ సీట్లు ఉన్నాయని వెల్లడించారు. ఆగస్టు-3న కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు. మిగిలిన వివరాలకు ఫోన్ నంబర్లు 8121450657, 9959502238ను సంప్రదించాలని సూచించారు.

బార్ అసోసియేషన్‌కు విరాళాలు

- ఉదారత చాటుకున్న న్యాయవాదులు



విరాళం అందించిన హైకోర్టు స్పెషల్ ఏపీపీ శ్రావణ్ కుమార్‌ను అభినందిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాద్

విజయనగరం లీగల్: పుట్టిన ఊరును మర్చిపోకుండా, తమ పెద్ద మనసును చాటుకున్నారు పలువురు న్యాయవాదులు. కెరీర్ మొదట్లో ఇక్కడ న్యాయవాదులుగా కొద్ది రోజులు సేవలు అందించి, తరువాత హైకోర్టుకు వెళ్లి ఉన్నత స్థానాలు పొందినప్పటికీ, పుట్టిన గడ్డను మర్చిపోలేదు. తమవంతు సాయాన్ని అందించారు. ఈ మేరకు ఉమ్మడి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరుకు చెందిన న్యాయవాది నైదాన శ్రావణ్ కుమార్, విజయనగరం బార్ అసోసియేషన్‌కు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును హైకోర్టు న్యాయమూర్తుల చేతుల మీదుగా అసోసియేషన్‌కు అందజేశారు. శ్రావణ్ కుమార్ ప్రస్తుతం స్పెషల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, హైకోర్టులో సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో సేవలందిస్తున్న, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలానికి చెందిన మరో న్యాయవాది రౌతు సురేష్ కుమార్ విజయనగరం బార్ అసోసియేషన్‌కు లక్ష రూపాయలు విరాళాన్ని, హైకోర్టు న్యాయమూర్తుల చేతుల మీదుగా అందజేశారు. సురేష్ కుమార్ ప్రస్తుతం హైకోర్టులో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ప్రాసిక్యూటర్‌గా, జీఎస్టీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. అలాగే జిల్లాకు చెందిన ప్రముఖ న్యాయవాది అప్పికొండ రామకృష్ణ నాయుడు, ఏపీ బార్ కౌన్సిల్‌తో కలిసి, విజయనగరం బార్ అసోసియేషన్‌కు ఐదు లక్షల రూపాయల విరాళం అందజేశారు. విరాళాలు అందించిన దాతలను, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషశాయి, జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జిల్లా పోర్టుఫోలియో జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ దుప్పల వెంకట రమణ చేతుల మీదుగా సన్మానింప చేసి విజయనగరం బార్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సీతయ్య మృతదేహం

రామభద్రపురం: మండలంలోని మామిడివలస గ్రామానికి చెందిన కొండపల్లి సీతయ్య (35) చెట్టుకు ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతయ్యకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది నెలల క్రితం భార్య వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. ఉన్న ఇద్దరు పిల్లలను పోషించడానికి కష్టంగా మారడంతో మనస్తాపానికి గురైన సీతయ్య శనివారం సాయంత్రం మామిడివలస, కొండ కెంగువకు మధ్యలో ఉన్న చెరువు పక్కన కాగు చెట్టుకు ఉరిపోసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.తల్లి పోలమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్ర నాయుడు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లి వేరే వ్యక్తితో వెళ్లిపోవడం, తండ్రి మృతి చెందడంతో పిల్లలు అనాథలైపోయారని గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు.

వంగర-రాజాం రోడ్డుపై ఏనుగులు



వంగర-రాజాం రోడ్డు దాటుతున్న ఏనుగు

వంగర: మండల పరిధి మడ్డువలస వద్ద వంగర - రాజాం రోడ్డుపై ఏనుగులు సంచరిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం సమయానికి సంగాం పంట పొలాల్లోని సంచరించిన ఏనుగులు రాత్రి సమయంలో రోడ్డుకు అడ్డంగా రావడంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు నిలిపివేసి గంటల తరబడి వేచి ఉన్నారు. ఎలిఫెంట్ ట్రేకర్స్, అటవీశాఖ సిబ్బంది వాటితో ఉంటూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

ఆగస్టు 1నుంచి ఆందోళనకు సిద్ధం

- సేవా పేపరు మిల్లు కార్మికులు, వారి కుటుంబాల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్ మహంతి

జయపురం: సేవా పేపరుమిల్లు శ్రామికులు, విశ్రాంత శ్రామికులు, మృతిచెందిన వారి కుటుంబాలకు యాజమాన్యం చెల్లించాల్సిన బకాయిలు జూలై 31లోగా చెల్లించాలని కార్మికనేత ప్రమోద్‌కుమార్ మహంతి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆగస్టు 1నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జయపురం కార్మిక భవనంలో జరిగిన సమావేశంలో సేవా శ్రామికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 మే 9నుంచి మిల్లు బాధ్యతలు చేపట్టిన యాజమాన్యాం.. పేపరు ఉత్పత్తి ప్రారంభించిందని గుర్తు చేశారు. అయితే శ్రామికులకు సగం వేతనమే చెల్లిస్తున్నారని, గత 2 నెలలుగా అది కూడా జమ చేయడం లేదన్నారు. కంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న వారికి 3నెలలుగా జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. అలాగే కలప సమకూర్చుతున్న వారికి బకాయిలు విడుదల చేయకపోవడంతో వారు సరఫరా నిలిపివేశారని తెలిపారు. దీంతో ఈనెల 14నుంచి మిల్లులో ఉత్పత్తి నిలిచి పోయిందని, దీనిని సాకుగా చూపించి మిల్లును మూసి వేసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం కలుగ జేసుకొని, మిల్లు నడిపించడంతో పాటు శ్రామికులకు అండగా నిలవాలని కోరారు. లేనిపక్షంలో ఆగస్టు 1నుంచి జయపురం ప్రధాన ట్రాఫిక్ కూడలి వద్ద ఆందోళన చేపడతామని వివరించారు. జయపురం సిటీ కో-ఆర్డినేషన్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జుధిష్టర్ రౌళొ, ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు నళినీరథ్, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



పోరుయాత్రలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలని, మద్యం మత్తు పదార్థాలను నియంత్రించాలని, నిపుణులతో కమిటీ వేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా చేపట్టిన హింసపై మహిళ పోరు యాత్ర ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఐద్వా, సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, శ్రామిక మహిళలు పూలుచల్లి ఘనంగా స్వాగతించారు. అనంతరం పోరు యాత్రకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి ప్రభావతి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ప్రతి చోటా మహిళలపై దాడులు, అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా మత్తు పదార్థాలు, మద్యం దాడులకు కారణమన్నారు. మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, హింసను ప్రేరేపించే చిత్రాలను, ఇంటర్నెట్‌లో అశ్లీల కార్యక్రమాలు నిషేధించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. పోరుయాత్రకు స్వాగతం పలికిన వారిలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరామమ్మ, నాయకులు వి.లక్ష్మి, ఎ.జగన్మోహన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్రపట్నాయక్, జేవీవీఆర్‌కే ఈశ్వరరావు, తిరుపతి నాయుడు, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ నాయకురాలు పావని, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్, డీవై ఎఫ్ఐ నాయకులు హరీష్, సతీష్, బి.రమణ, త్రినాథ్, జేవీవీ సమతా మహిళా కన్వీనర్ జి.నిర్మల, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు వై.సత్యవతి పి. పూర్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి, జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



పాముకాటుకు గురై మృతి చెందిన శ్రీను

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ గ్రామంలో పాముకాటు బారిన పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముగడ శ్రీను (38) శనివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని కళ్లానికి చేరుకుని పశువులకు గడ్డి వేసేందుకు వరికుప్పలు తీస్తుండగా పాము కాటువేసింది. దీంతో హుటాహుటిన ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స చేసి పలుజాగ్రత్తలు చెప్పి ఇంటికి పంపించారు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటివద్ద శ్రీను మృతిచెందాడు. దీనిపై మృతుడి సోదరి రమణమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎల్.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పి ల్లలు ఉన్నారు.

మలేరియాతో గిరిజన బాలుడు..



పెద్దపల్లంకివలసలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని దోనుబాయి పీహెచ్‌సీ పరిధి పెద్దపల్లంకివలస గ్రామానికి చెందిన గిరిజన బాలుడు బిడ్డిక కార్తికేయ (6) మలేరియాతో శ్రీకాకుళం రిమ్స్‌లో శనివారం మృతిచెందాడు. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలుడిని సీతంపేట సీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యసేవలు అందజేశారు. ఉద్యోగ రీత్యా తండ్రి పెంటయ్య ఉంటున్న సరుబుజ్జిలి గ్రామానికి బాలుడు వెళ్లగా జ్వరం తీవ్రమైంది. దీంతో వెంటనే అక్కడి పీహెచ్‌సీకి తీసుకువెళ్లి పరీక్ష చేయించగా మలేరియా పాజిటివ్ రావడంతో వైద్యులు శ్రీకాకుళంలోని రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో అప్రమత్తమైన వైద్యసిబ్బంది డిప్యూటీ డీఎంహెచ్‌వో చిరంజీవి ఆధ్వర్యంలో పెద్దపల్లంకివలసలో ఆదివారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరి రక్తన మూనాలు సేకరించారు. ఎటువంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్ తెలిపారు. గ్రామంలో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్, బావుల్లో క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టారు.

పౌల్ట్రీ కార్మికుల నిరసన

- యాజమాన్యం అన్యాయం చేస్తోందని ఆవేదన
- నల్లరిబ్బన్లతో విధి నిర్వహణ



వెంకట్రామా పౌల్ట్రీస్‌లో నల్లరిబ్బన్లతో విధులు నిర్వహిస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

చీపురుపల్లి: కార్మికశాఖ అధికారుల సమక్షంలో జరిగిన అగ్రిమెంట్‌ను కనీసం అమలు చేయకుండా, కొత్త అగ్రిమెంట్‌ను పట్టించుకోకుండా యాజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తోందని వెంకట్రామా పౌల్ట్రీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఐ.గౌరినాయుడు, ప్రధాన కార్యదర్శి టి.ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఎ.గౌరినాయుడులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం కూడా కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్నామని కార్మికులకు న్యాయం జరగకపోతే భవిష్యత్‌లో నిరసన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 2023 మే 31 నాటికి కార్మికుల కోసం చేయదలచిన పనుల అగ్రిమెంట్‌ను కార్మికశాఖ, అధికారుల సమక్షంలో గత ఏడాది యాజమాన్యం ఇచ్చిందన్నారు. అయితే గత ఏడాది అగ్రిమెంట్‌లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి కొత్తఅగ్రిమెంట్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రెండు నెలలు కావస్తున్నా యాజమాన్యం ముందుకు రావడం లేదని, ఈ నేపథ్యంలో నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు. అగ్రిమెంట్‌లో భాగంగా ఈ ఏడాది ప్రతి కార్మికుడికి నెలకు కనీసం రూ.18 వేలు వేతనం కల్పించాలని, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, గత ఒప్పందంలో భాగంగా షిఫ్ట్ డ్యూటీల సదుపాయం, ఏడాదికి 20 శాతం బోనస్, డైనింగ్ హాలు, రెస్ట్ రూం, సైకిల్ షెడ్లు నిర్మించాలని, కార్మికులందరికీ సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని కోరుతూ యాజమాన్యానికి నోటీస్ అందజేసినట్లు చెప్పారు. గత ఏడాది జరిగిన అగ్రిమెంట్‌లో కూడా ఈ హామీలు నెరవేర్చేందుకు యాజమాన్యం అంగీకారం తెలిపినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కార్మికశాఖ అధికారులు చొరవ చూపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

లాడ్జిలో మహిళ హత్య

- నిర్వాహకుల నిర్లక్ష్యంతో లభ్యం కాని ఆధారాలు
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు



హత్య జరిగిన చందన్ లాడ్జి ఎదుట గుమిగూడిన జనం

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ-అరకు రహదారిలో ఉన్న చందన్ ఎ.సి లాడ్జిలో ఓ మహిళ హత్యకు గురైన విషయం ఆదివారం బయటకు పొక్కడంతో ఒక్కసారిగా పట్టణవాసులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చందన్ లాడ్జి సర్వీస్ బాయ్ రూమ్ సర్వీస్ కోసం వెళ్లిన సమయంలో రూమ్ నంబర్ 103నుంచి దుర్వాసన వస్తోందని, చెప్పడంతో నిర్వాహకులు అనుమానంతో 100కి కాల్ చేశారు. దీంతో పోలీసులు వచ్చి రూమ్ తలుపులు తెరిచి చూడగా లాడ్జి గదిలో మహిళ మృతదేహం పడి ఉండడంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, క్లూస్‌టీమ్‌ను రప్పించారు. డీఎస్పీ గోవిందరాజు ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రూమ్ తీసుకున్నది అల్లూరి జిల్లా వాసి

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువ్యాలీ మండలం పరిధి ఉరుముల గ్రామానికి చెందిన మాదల శ్రీరాములు ఈ నెల 24న పట్టణంలోని చందన్ ఎ.సి లాడ్జిలో రూమ్ నంబర్ 103ను బుక్ చేశాడు. 27 వరకూ ప్రతిరోజూ లాడ్జికి వచ్చి రోజువారీ అద్దె రూ.600 చెల్లించాడు. 29, 30 తేదీల అద్దె చెల్లించకపోవడంతో ఆదివారం ఉదయం 10.52గంటల సమయంలో కాల్‌చేస్తే ఫోన్‌పే చేస్తానని చెప్పినట్లు లాడ్జి సిబ్బంది తెలిపారు.

లాడ్జిలో లేని సీసీ కెమెరాలు

హత్య జరిగిన లాడ్జిలో ప్రవేశం వద్ద, రిసెప్షన్ కౌంటర్ల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల లాడ్జిలోకి వచ్చిన వారి వివరాలు నమోదు కాలేదు. హత్యలో ఎవరి ప్రమేయం ఉంది? ఎందరు ఉన్నారు? ఎప్పుడు జరిగింది? హత్యకు కారణం ఏమిటి? అన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

హత్య జరిగి ఐదారు రోజులు

హత్య ఘటనపై కొత్తవలస సీఐ చంద్రశేఖర్ వివరణ ఇస్తూ... లాడ్జిలోని రూమ్ నంబర్ 103లో దుర్వాసన వస్తోందని ఫిర్యాదు చేయడంతో వచ్చి డోర్ ఓపెన్ చేసి చూసి మహిళ మృతదేహం ఉండడం గమనించాం. బహుశా హత్య జరిగి ఐదారు రోజులు కావచ్చని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించామని చెప్పారు.

ప్రతిభకు పదును



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

- విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు

బరంపురం: ఆగస్టు 15న జరగనున్న 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిధా ఆదేశించిన నేపథ్యంలో పాలనా యంత్రాంగం ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యలయ సమావేశ మందిరంలో విద్యార్థులకు ఆదివారం వక్తృత్వ, చిత్రలేఖనం, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన చిన్నారులు పాల్గొని, ప్రతిభ కనబరిచారు. నగరంలోని సుమారు 50పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఆగస్టు 15న జరగనున్న వేడుకల్లో బహుమతులు అందించనున్నట్లు డీపీఆర్‌ఓ రబికుమార్ బెహరా తెలిపారు.



వక్తృత్వ పోటీలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు

ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో

జయపురం: జయపురం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అమో సంస్కృతి ఆమో గర్వ్(మన సంస్కృతి-మన గర్వం) అనే అంశంపై జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొని, తమ ఆలోచనలను వ్యక్త పరిచారు. ఎఫ్‌సీఐ జయపురం అధికారి బి.ధనేశ్వరరావు, బీకే ప్రధాన్, గైర హరిదాస్ పోటీలను పర్యవేక్షించారు.



జయపురం: ఎఫ్‌సీఐ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

వ్యాధి నిరోధక టీకాలు శతశాతం లక్ష్యం

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు



డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: వ్యాధి నిరోధక టీకాలు శతశాతం లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమానికి సంబంధించి సర్వే జిల్లాలో పూర్తి కావచ్చిందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.జగన్నాథ రావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సర్వే ద్వారా వ్యాకినేషన్‌కు నోచుకోని చిన్నారులను గుర్తించి ఆగస్టు 7 నుంచి 12 వరకు జరగబోయే మొదటి దశ మిషన్ ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమం ద్వారా ఆయా పరిధిలో వైద్య సిబ్బంది టీకా వేస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే వైద్య సిబ్బంది జిల్లాలో ఉన్న మొత్తం 42 పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఉన్న ఇళ్లను సర్వే చేశారన్నారు. ముందస్తు ప్రణాళిక మేరకు వలస కార్మికులు, హైరిస్క్ ప్రాంతాలు, కొన్ని అనారోగ్య కారణాల వల్ల వ్యాక్సిన్‌కు నోచుకోని పిల్లలు, గర్భిణులను ఈ సర్వేలో గుర్తించి వ్యాక్సిన్‌తో నివారించదగిన వ్యాధుల (తట్టు, రుబెల్లా)ను పూర్తి స్థాయిలో నిర్మూలించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రెండవ దశ మిషన్ ఇంద్ర ధనుష్ సెప్టెంబరు 11నుంచి 16లోగా, మూడవ దశ అక్టోబర్ 9 నుంచి 14 వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ సర్వేలో గుర్తించిన అర్హులను కొత్తగా ప్రవేశ పెట్టిన యూవీ పోర్టల్‌లో నమోదు చేస్తామని తద్వారా టీకా పూర్తయిన వారికి ఆన్‌లైన్ ద్వారా వ్యాక్సిన్ సర్టిఫికెట్ జారీ చేయవచ్చని తెలిపారు. తదుపరి రోజుల్లో టీకా నిర్వహణ తర్వాత ఇదే ఆన్‌లైన్ పద్ధతిన కొనసాగుతుందని వివరించారు.

320 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయితో పాటు వ్యాన్ సీజ్ చేస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్, స్థానిక సీఐ అప్పలనాయుడు

గజపతినగరం: మెంటాడ మండలంలోని లోతుగెడ్డ సమీపంలో సుమారు 320 కిలోల గంజాయి పట్టుకుని సీజ్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన గజపతినగరం సర్కిల్ ఆఫీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంద్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో లోతుగెడ్డ సమీపంలో గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం వచ్చిన మేరకు గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు, ఆంద్ర, గజపతినగరం ఎస్సైలు, సిబ్బంది ఆదివారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో అశోక్ లేలాండ్ మ్యాక్సీ పికప్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేస్తున్న సమయంలో డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. అలాగే ఆ వ్యాన్‌లో ఉన్న 320.205కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనంతో పాటు గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. పోలీసులతో పాటు రెవెన్యూ సిబ్బంది నిందితుడిని విచారణ చేయగా ఒడిశాలోని కొరాపుట్ జిల్లా లమటాపుట్ దగ్గర తోసిబా గ్రామానికి చెందిన బాగ్‌బాగ్ కిల్లో(33)గా తేలిందన్నారు. గంజాయి ప్యాకెట్లతో పాటు రూ.7వేలు నగదు, మ్యాక్సీ క్యాబ్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడిని విచారణ చేయగా రాహుల్ ఖా, జోగేష్‌లు సరుకుకు సంబంధించిన వ్యక్తులుగా చెప్పడంతో వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా కారు బొండపల్లి మండలం బోడసింగుపేట వద్ద విడిచిపెట్టి పరారయ్యారని దీంతో ఆ కారును కూడా సీజ్ చేసినట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ ఎల్.అప్పలనాయుడు, ఆంద్ర, గజపతినగరం ఎస్సైలు సిద్ధార్థ, గంగరాజులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ కింద రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణ



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

విజయనగరం టౌన్: అమృత్ భారత్ పథకంలో భాగంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ పరిధిలో ఎంపికైన రైల్వేస్టేషన్‌లను పరిశీలించేందుకుగానూ నూతనంగా వచ్చిన రైల్వే డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ఆదివారం ఆకస్మిక పర్యటన చేశారు. అభివృద్ధికి కావాల్సిన అంశాలపై అధికారులతో రైల్వేస్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ బయ ట ఉన్న ప్రాంతాలను పర్యవేక్షించారు. పలు సూచనలు చేశారు. అప్రోచ్ రోడ్డు పెంచాల్సిన అవసరంపై ఆరా తీశారు. రైల్వేస్టేషన్‌లో ఫుడ్ కోర్టులు పనితీరు, నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా.. లేదా.. అనేది పర్యవేక్షించి, మరింత మెరుగైన అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజ రు చక్రవర్తి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువుల అక్రమ రవాణా అడ్డగింత



పశువులతో పట్టుబడిన లారీ

నరసన్నపేట: జాతీయ రహదారిపై అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్న 36 పశువులను నరసన్నపేట పోలీసులు పట్టుకొని విశాఖలోని గోశాలకు తరలించారు. ఈ వ్యవహారంలో రాజేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి పశువులను తరలించేందుకు వినియోగించిన లారీని సీజ్ చేశారు. నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం తెలిపిన వివరాల ప్రకారం.. తిలారు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఒక లారీపై పశువులు తరలిస్తున్నట్లు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు మడపాం వద్ద ఆదివారం వేకువజామున కాపు కాశారు. వచ్చిన లారీని పట్టుకొని పరిశీలించారు. దీంట్లో రెండు ఆవులు, 8 దూడలు, 26 ఎద్దులు మొత్తం 36 పశువులు ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. పట్టుబడిన పశువులను విశాఖ గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమంగా పశువులు తరలిస్తున్నట్లు ఎవరికి తెలిసినా సమాచారం ఇవ్వాలని కోరారు. అక్రమంగా పశువులను తరలించడం నేరమని అన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు



పోలాకి కాలువలో గాలింపు చర్యలు చేపడుతున్న సీఐ ప్రసాదరావు

పోలాకి: పోలాకి పెద్దకాలువలో గుర్రపు డెక్క తొలగింపు కోసం వెళ్లి గల్లంతైన రైతు ముప్పిడి శాంతారావు కోసం ఆదివారం కూడా గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగాయి. 50 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం కాలువలో గాలించినప్పటికీ రైతు ఆచూకీ లభించలేదు. గాలింపు చర్యలను తహసీల్దార్ శ్రీరాములు, నరసన్నపేట సీఐ ప్రసాదరావు, వంశధార డీఈ శ్రీహరి తదితరులు రోజంతా దగ్గరుండి పర్యవేక్షించారు. సోమవారం కూడా గాలింపు చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. మరోవైపు కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవటంపై వంశధార అధికారులకు వేసవిలోనే తెలియజేసినప్పటికీ పట్టనట్లు వ్యవహరించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో భంభోల్ కావడి యాత్ర



భంభోల్ కావడి యాత్రలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: పట్టణంలో ఆదివారం భంభోల్ కావడి యాత్ర నిర్వహించారు. తెల్లవారుజామున పట్టణంలోని గేదెలవానిపేట వద్ద గల శివాలయం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్లు పట్టణం చుట్టు పక్కల కావడియాత్ర నిర్వహించారు. పాలపోలమ్మ తల్లి ఆలయం వెనుక ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలోగల శివుని విగ్రహం వద్ద ఈ కావడి యాత్ర ముగించారు.

23 నాటుబాంబులు స్వాధీనం



కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం, లఖందిడ్డి పంచాయతీ మూలపేటలో ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో నాటు బాంబు పేలి ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాడుగుపాడు గ్రామానికి చెందిన జోగి సింహాచలం అడవి పందులను వేటాడేందుకు తెల్లవారుజామున మూల పేట గ్రామం పక్కన గల పెద్దకొండ వద్దకు వెళ్లాడు. ఇంతలో అడవి పంది కనిపించడంతో ఓ నాటుబాంబును విసిరాడు. అది కాస్తా గురి తప్పి పక్కన పడింది. అయితే ఆ సమయంలో మూలపేట గ్రామానికి చెందిన సారిపల్లి మల్లేసు, ఈగల చిన్నారావు, యుదుడ్బోయిన రోహిణీరావు అటువైపు బహిర్భూమి కోసం వెళ్లారు. దీంతో వారికి సమీపంలో నాటుబాంబు పడి పేలడంతో స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వీరు సింహాచలం పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 23 నాటుబాంబులు లభ్యమయ్యాయి. సింహాచలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

నీటి బొట్టు.. ఒడిసిపట్టు

పుడమి కడుపున వాన నీటిని దాచేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ప్ర'జల' సమస్యల పరిష్కారానికి ఆకాశ గంగను పాతాళంలోకి పంపించి భద్రపరిచే ఏర్పాట్లు మొదలుపెట్టింది. 'రూఫ్ వాటర్ హార్వెస్టింగ్' పేరిట సంప్రదాయ పద్ధతుల్లో నీటిబొట్టును ఒడిసి పట్టే ప్రణాళిక రూపొందించింది. మొదటి దశలో ప్రతి మండలంలోనూ రెండు నుంచి మూడు చోట్ల ఈ పనులకు శ్రీకారం చుట్టను న్నారు. ఈ ప్రక్రియ విజయవంతమైతే మండు వేసవిలోనూ నిండుగా నీరు లభిస్తుంది.





గార మండలం గొంటి గ్రామంలో సచివాలయం వద్ద ఇంకుడు గుంత కోసం కొలతలు వేస్తున్న డ్వామా అధికారులు

- రూఫ్ వాటర్ హార్వెస్టింగ్‌తో వాన నీటిని ఒడిసిపట్టేందుకు శ్రీకారం
- వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా ఏర్పాట్లు
- ఉపాధి పథకం ద్వారా పనులు

కంచిలి: వానా కాలంలో ఎక్కడ చూసినా నిండుగా నీళ్లు ఉండడంతో చాలా ప్రాంతాల కన్నీళ్లు బయట ప్రపంచానికి కనిపించవు. ఒక్కసారిగా మబ్బులు దూరమై ఎండలు కాయడం మొదలుపెడితే తాగునీటికి వారు పడుతున్న తంటాలు తెలుస్తాయి. ఇలాంటి ప్రాంతాల అవస్థలు తీర్చే ఒకే ఒక మార్గం భూగర్భ జలాలు పెంచడం. ప్రభుత్వం ఈ భగీరథ ప్రయత్నం మొదలుపెట్టింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వాన నీటిని భూమిలోకి పంపించేందుకు నడుం కట్టింది. ఇంటి పైకప్పుపై పడే వాన నీటిని సంరక్షించడం చాలాకాలంగా వస్తున్న సంప్రదాయం. ఈ పద్ధతినే అమలు చేయడానికి డ్వామా అధికారులు 'రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్' పద్ధతికి శ్రీకారం చుట్టారు.

మండలానికి 2 నుంచి 3 చోట్ల నిర్మాణాలు..

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలో ప్రతి మండలంలో అక్కడి పరిస్థితిని బట్టి రెండు నుంచి మూడు గుంతల నిర్మాణానికి స్థలాలు గుర్తించి, అంచనాలు రూపొందించే ప్రక్రియను చేపడుతున్నారు. త్వరలో పనులు ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు.



ఇచ్ఛాపురం మండలం కేదారిపురం సచివాలయం వద్ద రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం

ఇంకుడు గుంతల నిర్మాణం ఇలా..

- ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఆయా ప్రాంతాల్లో వసతిని బట్టి నిర్మించనున్నారు.
- పెద్దసైజు ఇంకుడు గుంతకు రూ.74,656లు, చిన్నసైజు గుంతకు రూ.53,200లు ఖర్చు చేయనున్నారు.

భూగర్భ జలాల పెంపు కోసం..



జిల్లాలో భూగర్భ జలాల పెంపు కోసం ఈ రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ పద్ధతిలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. దీని కోసం మండలాలవారీగా అంచనాలు రూపొందించే ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. మేం మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతల్ని నిర్మిస్తున్నాం. ఈ పద్ధతిని ప్రజలు కూడా వారి ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకొని, వర్షపు నీటిని భూమిలో ఇంకించే ప్రక్రియను చేపడితే ఫలితాలు వేగవంతంగా వస్తాయి.

– జీవీ చిట్టిరాజు, డ్వామా పీడీ, శ్రీకాకుళం

- మొత్తం ఉపాధి హామీ వేతనదారులతోనే ఈ పనులు చేపట్టనున్నారు.
- సిమెంటు, ఇసుక, కంకర తదితర సామగ్రిని వాడుతారు.
- దాదాపు ఆరు మీటర్ల లోతు ఉండేలా నిర్మాణం ఉంటుంది. కింది నుంచి ఒకటిన్నర మీటరు వరకు 225–300మిల్లీమీటర్ల కంకర, ఒకటిన్నర మీటరు తర్వాత 150 మిల్లీమీటర్ల కంకర, 0.60 మీటర్ల లోతులో 40 మిల్లీమీటర్ల కంకర, 0.30 మీటర్లలో 20 మిల్లీమీటర్ల కంకర, 0.30 మీటర్ల దగ్గరు ఇసుక, తర్వాత పై భాగంలో ఫ్లై యాష్ బ్రిక్స్‌తో కట్టడంతో ఇంకుడు గుంత నిర్మాణం పూర్తవుతుంది.
- వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతల నిర్మాణంతో ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విధానం ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు అవకాశం ఉంటుంది.

ఎక్కడెక్కడ..?

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు.
- మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు.
- ప్రభుత్వ ఆస్పత్రులు, బల్క్‌మిల్క్ సెంటర్లు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా పాఠశాలలు.
- గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ భవనాలు వద్ద ఇంకుడు గుంతలు నిర్మిస్తారు.

కేజీబీవీ.. బోధనలో తీవి

- కేజీబీవీల్లో చదువుకు ఎనలేని డిమాండ్
- 25 కేజీబీవీల్లో 6690 మంది బాలికల విద్యాభ్యాసం
- ఎన్నో వసతులు, మరెన్నో సౌకర్యాలతో ఆదర్శంగా నిలుస్తున్న విద్యాలయాలు



మధ్యాహ్న భోజనానికి ముందు ప్రేయర్ చేస్తున్న బాలికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల(కేజీబీవీ) క్రేజ్ ఆకాశాన్ని తాకుతోంది. వీటిలో సీట్లన్నీ భర్తీ అయి తరగతి గదులు కిటకిలాడుతున్నాయి. బాలికా విద్యను ప్రోత్సహించేందుకు నెలకొల్పిన ఈ కేజీబీవీలు సత్ఫలితాలతో దూసుకుపోతున్నాయి. వైఎస్ జగన్ సర్కారు హయాంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా చక్కటి సదుపాయాలు కల్పిస్తుండడంతో కేజీబీవీల్లో చేరేందుకు బాలికలు పోటీ పడుతున్నారు. రూపాయి ఫీజు లేకుండా కేజీబీవీల్లో కార్పొరేట్‌ను తలదన్నే విధంగా నాణ్యమైన ఇంగ్లిష్ మీడియంలో బోధనను అందిస్తున్నారు.

సీట్లు లేవు..

ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుండడంతో కేజీబీవీల్లో ఏటా ప్రవేశాలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు గ్రామాలకు వెళ్లి డ్రాపౌట్లను గుర్తించి, పిల్లలను, తల్లిదండ్రులను సిబ్బంది చైతన్యం చేసి కేజీబీవీల్లో చేర్పించేవారు. అప్పటికీ సీట్లు మిగిలిపోయేవి. ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితి లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. వందలాది మంది చేసుకున్న దరఖాస్తులలో వివిధ ప్రామాణికతలను చూసి సీట్లను భర్తీ చేస్తున్నారు. వసతి సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకుని సీట్ల కోసం వచ్చిన వారికి కేటాయించలేని పరిస్థితి ప్రస్తుతం నెలకొందని సమగ్రశిక్షా జిల్లా ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ చెబుతున్నారు.

ఫలితాల్లో టాప్

వీటిలో చదువుతున్న విద్యార్థులు సైతం గణనీయమైన ఫలితాలను సాధిస్తున్నారు. టెన్త్, ఇంటర్ రెండింటా స్టేట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ ఏడాది 10వ తరగతిలో సారవకోట కేజీబీవీకి చెందిన ఉర్లాన జాహ్నవి 600కు గాను 590 మార్కులు తెచ్చుకుని ఈ స్కూళ్లలో స్టేట్ టాపర్‌గా నిలిచింది. సాక్షాత్తు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా జగనన్న ఆణిముత్యాల పేరిట ఘనంగా సత్కారాన్ని అందుకుంది. అలాగే ఇంటర్మీడియెట్‌లో రుప్ప యమున– ఎంపీసీలో 974 (కేజీబీవీ శ్రీకాకుళం), వంపూరు అశ్విని– బైపీసీలో 956 (కేజీబీవీ పొందూరు), బడే ఇందిర– సీఈసీలో 910 (కేజీబీవీ కవిటి) మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు.

25 కేజీబీవీలు.. 6690 మంది బాలికలు

6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యను అందించే కేజీబీవీ విద్యాలయాల్లో తరగతికి 40 సీట్లు చొప్పున భర్తీ చేస్తారు. ఇంటర్మీడియెట్‌కు వచ్చేసరికి ఒక కేజీబీవీలో ఒక గ్రూపును మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా ఇయర్‌కు 40 సీట్లు చొప్పున భర్తీ చేశారు. 30 మండలాల శ్రీకాకుళం జిల్లాలో 25 కేజీబీవీలు ఉన్నాయి. వీటిల్లో ప్రస్తుతం 6,690 మంది చదువుతున్నారు. సీట్లన్నీ భర్తీ కావడంతో తరగతి గదులు కిటకిటలాడుతున్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఇటీవల ప్రభుత్వం అవసరైన బోధనా సిబ్బందిని నియమించింది. అలాగే డిజిటల్ విద్యా బోధన, నాడు–నేడుతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. నాణ్యమైన మెనూ ప్రకారం భోజనం, అమ్మఒడి, విద్యాకానుక, ట్యాబ్‌ల అందజేత, బైజూస్ కంటెంట్‌తో బోధన వంటి కార్యక్రమాలతోపాటు అనేక రాయితీలు కల్పిస్తున్నారు.


రూపాయి ఖర్చు లేదు



కేజీబీవీలు నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. రూపాయి ఖర్చు లేకుండా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా చదువు, వసతి కల్పిస్తూ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నాం. సమగ్రశిక్ష స్టేట్ పీడీ, కలెక్టర్ సూచనల మేరకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అక్కడి బాలికలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఈ ఏడాది కూడా విద్యార్థినుల ప్రవేశాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మూడు పూటల నాణ్యమైన, పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తున్నాం. ఇటీవలి బోధనా సిబ్బందిని నియమించాం.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్షా ఏపీసీ, శ్రీకాకుళం

కొండ గుండెలో..



జోరువానలకు మందస మండలంలోని గిరిజన ప్రాంతంలో ఉన్న డబారుసింగి రిజర్వాయర్ నిండుకుండలా మారింది. సాయం సంధ్య వేళ ఇలా మహేంద్ర గిరుల పాదాల చెంతన అందంగా కనువిందు చేస్తోంది.

– మందస

విలాసాల నాగరాజు.. మళ్లీ దొరికాడు!



గంజాయి ప్యాకెట్లు ఉన్న బ్యాగులివే..

శ్రీకాకుళం క్రైమ్ : విలాసాల నాగరాజు మళ్లీ పోలీసులకు దొరికిపోయాడు. ఎంబీఏ వరకు చదువుకుని.. రంజీ లెవెల్‌లో క్రికెట్ ఆడి, స్పాన్సర్ల డబ్బుతో జల్సాలకు అలవాటు పడి, మోసాలు చేయడం ప్రారంభించిన బుడుమూరు నాగరాజు గంజాయి తరలిస్తూ ఆదివారం పోలీసులకు పట్టుబడ్డాడు. ఇప్పటికే అతనిపై 25కు పైగా చీటింగ్ కేసులు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్నాయి. కార్పొరేట్ కంపెనీలను బురిడీ కొట్టించి రూ. లక్షలు వసూలు చేయడమే కాదు, జిల్లాలో అయితే రెండు గంజాయి (టెక్కలి, రాజాం), రెండు ఎక్సైజ్ సంబంధిత కేసుల్లో ముద్దాయి కూడా. ఆదివారం వేకువజామున నగర శివార్లలోని శీపన్నాయుడుపేట దరి విజయాదిత్య పార్క్ వద్ద 23.475 కిలోల గంజాయితో మళ్లీ పోలీసులకు దొరికాడు. ఇతని స్వగ్రామం పోలాకి మండలం యవ్వారిపేట. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాత్రి వచ్చిన నిఘా వర్గాల సమాచారంతో ఆదివారం వేకువజామున రెండో పట్టణ ఎస్‌ఐ



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

నాగిరెడ్డి లక్ష్మణరావు తన సిబ్బందితో మాటువేసి నాగరాజును పట్టుకున్నారు. నాగరాజును అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న రెండు బ్యాగుల్లో తొమ్మిది గంజాయి ప్యాకెట్లను గుర్తించి వాటిని రెవెన్యూ అధికారుల సమక్షంలో వేయింగ్ మిషన్ ద్వారా తూయించగా 23.475 కిలోలున్నట్లు నిర్ధారించారు. నాగరాజును పోలీసులు విచారించగా తాను ఒడిశా పర్లాఖిముండిలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద కొన్నానని, విశాఖపట్నం వరకు బస్సులో వెళ్లి అక్కడినుంచి ముంబైకు తరలించేందుకు యత్నిస్తున్నట్లు చెప్పాడు. టెక్కలిలో పది నెలల కిందట ఒడిశా మద్యం 48 బాటిళ్లతో అప్పటి ఎస్‌ఐ కామేశ్వరరావుకు దొరికిపోయాడు. టెక్కలిలో మూడు నెలల కిందట ఐదున్నర కిలోల గంజాయితో ఎస్‌ఐ రామకృష్ణకు పట్టుబడ్డాడు. రాజాంలోనూ ఇలాగే గంజాయి తరలిస్తూ దొరికాడు. అంతే కాదుమాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పీఏనంటూ కేర్ ఆస్పత్రి యాజమాన్యానికి రూ. 60 వేలు టోకరా వేసినట్లు విశాఖపట్నం టూటౌన్‌లో కేసు నమోదైంది. సెలెక్ట్ మొబైల్ ఎండీ నుంచి 2.88 లక్షలు, విజయవాడ రామకృష్ణ టౌన్‌షిప్ నుంచి 3.88 లక్షలు వసూలు చేసినట్లు కేసులు ఉన్నాయి. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తో పాటు తెలంగాణ మంత్రి కేటీఆర్ పీఏనంటూ అబద్ధాలు చెప్పి మోసా లు చేశాడు. నాగరాజును ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పప్పల శ్రీనివాసరావు చెప్పారు. ఎంత ప్రతిభ ఉన్నా సరైన దారిలో పయనిస్తేనే బాగుంటుందని సీఐ అన్నారు.



బుడుమూరు నాగరాజు

'మణిపూర్ సంక్షోభం వెనుక కుట్ర'



మాట్లాడుతున్న రచయిత అట్టాడ అప్పలనాయుడు

శ్రీకాకుళం కల్చరల్: మణిపూర్ సంక్షోభం ఆకస్మాత్తుగా పుట్టింది కాదని, అక్కడి ఖనిజ సంపద దోపిడీకి కార్పొరేట్ శక్తుల కోసం రూపొందించిన ముందస్తు పథకమని పలువురు కవులు, రచయితలు, కళాకారులు, వివిధ సాంస్కృతిక, ప్రజా సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన ఆదివారం శ్రీకాకుళంలోని క్రాంతి భవనంలో సమావేశం నిర్వహించారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ అక్కడి ఆదివాసీ తెగలను విభజించి పాలించే ప్రక్రియకు బ్రిటీషర్లు బీజాలు వేశారని చెప్పారు. అందమైన ఆ ప్రాంతానికి చాలా కాలం రాష్ట్ర హోదా రాలేదని, స్వతంత్ర భారత ప్రభుత్వాలు కూడా రాజకీయ ప్రయోజనాల కోసం అక్కడి తెగల మధ్య చిచ్చు పెడుతున్నాయని విమర్శించారు. అక్కడ అమూల్యమైన ఖనిజ సంపద ఉందని, కార్పొరేట్ శక్తులకు దాన్ని కట్టబెట్టడానికి తాజా సంక్షోభం సృష్టించారని, దీనివెనుక బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ కీలక పాత్ర పోషిస్తోందని విమర్శించారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ కుట్రకు మతం ముసుగు వేసి ప్రశ్నించే వారిపై కేంద్ర ప్రభుత్వ అనుకూల శక్తులు ఎదురుదాడి చేస్తున్నాయని మండిపడ్డారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షోభంలో మహిళలు, పిల్లలు బాధితులు కావడం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ కె.వి.జగన్నాథరావు, డీటీఎఫ్ అధ్యక్షుడు కోత ధర్మారావు, సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, జిల్లా అధ్యక్షుడు డి.గణేష్, ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి సనపల నరసింహులు, ఈశ్వరరావు, పత్తి సుమతి, తంగి ఎర్రమ్మ, కంచారాన భుజంగరావు, చింతాడ తిరుమలరావు, బొడ్డేపల్లి భూపతిరావు, కలమట దాసు బాబు, మణిపూర్ పరిణామాలపై కవితలు చదివారు. కార్యక్రమంలో సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.వి. మల్లేశ్వరరావు, ఇస్కఫ్ జిల్లా కార్యదర్శి జి.వి. నాగభూషణ్, రవి, కుటుంబ సంక్షేమ, హక్కుల సంఘం కన్వీనర్ ఎం.కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి

పోలాకి: మండలంలోని గుప్పెడుపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు సిరిగిడి కామయ్య(51) ఆదివారం వేకువజామున వేటకు వెళ్లగా పడవ బోల్తా పడి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, తోటి మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం.. వేకువజామున 4 గంటల సమయంలో నలుగురు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. అలల తాకిడికి పడవ ఒక్కసారిగా బోల్తాపడింది. వీరిలో చెక్క యర్రయ్య, రట్టి రాజయ్య, కర్రి సింహాచలంలు క్షేమంగా ఒడ్డుకు చేరుకోగా కామయ్య మాత్రం పడవ కిందపడి గాయపడటంతో అక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య రమణమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాయకుల పరామర్శ..

కామయ్య కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు తదితరులు పరామర్శించారు.

దళిత రైతులకు.. ప్రకృతి ప్రోత్సాహం



పంపిణీకి సిద్ధంగా ఉన్న కిట్లు

- ప్రకృతి సేద్యంలో రాణించేలా చర్యలు
- జిల్లాలో 440 మంది గుర్తింపు
- ఒక్కో కిట్ విలువ రూ.10వేలు
- ప్రతి కిట్‌లో మెటీరియల్, 23 రకాల విత్తనాలు
- రెండు విడతల్లో సరఫరా

ఇచ్ఛాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయంలో రాణించేలా దళిత రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వారికి అండగా నిలిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన(పీఎంఏజేఏవై) ద్వారా రెండు విడతల్లో జిల్లాలోని దళిత రైతులను అధికారులు గుర్తించారు. రైతు సాధికారిక సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) శ్రీకాకుళం ఆధ్వర్యంలో జిల్లాలో సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 390 మంది ఎస్సీ రైతులను తొలివిడతలో, మరో 50 మందిని రెండో విడతలో అధికారులు గుర్తించారు. పథకంలో భాగంగా రూ.పది వేలు విలువైన మెటీరియల్, 23 రకాల విత్తనాలను అందిస్తున్నారు. జిల్లాలో రూ.44 లక్షల విలువజేసే ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఖర్చు చేస్తున్నారు.

ఇవీ లాభాలు..

ప్రకృతి వ్యవసాయంలో అనేక లాభాలున్నాయి. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులను వినియోగించకుండా గో ఆధారిత ఎరువులు, వేప సంబంధిత ఉత్పత్తులు, కషాయాలతో నాణ్యమైన పంటలను పండించవచ్చు. పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉండటంతో రైతుకు నికరాదాయం లభిస్తుంది. వాతావరణ కాలుష్యం తగ్గడంతో పాటు రసాయన అవశేషాలు లేని ఆహార పంటల ఉత్పత్తి జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటోంది. రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది.

ఉచిత మెటీరియల్ ఇవే..

ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం గుర్తించిన దళిత రైతులకు రూ.10 వేలు విలువైన 8 ఫెరామిన్ ట్రాప్స్, లూర్స్, ఎల్లో స్టిక్కి ప్లేట్స్ 30, టార్పాలిన్ ఒకటి, 200 లీటర్ల డ్రమ్ము (మూత లేకుండా)ఒకటి, వంద లీటర్ల డ్రమ్ములు రెండు అందజేయనున్నారు. కిచెన్ గార్డెన్, సీడ్ టు సీడ్, ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్‌కు సంబంధించిన 23 రకాల విత్తనాలు అందిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జొన్నలు, మొక్కజొన్న, జీలుగ, పిల్లి పెసర, కట్టి జనుము, రాగులు, కొర్రలు, సజ్జలు, వేరుశనగ, మినుములు, పెసలు, కందులు, ఉలవలు, తదితర పంటలతో పాటు కిచెన్ గార్డెన్‌లో భాగంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలకు సంబంధించిన విత్తనాలను అందజేయనున్నారు.


తక్కువ పెట్టుబడితో..



ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు అందించింది. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి సాధించే పంటను పండించవచ్చు. ఇప్పటికే సిబ్బంది మాకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన పంటలను పండించుకునే అవకాశం ఉంటోంది.

– చుక్క భానుమతి, రైతు, ఇచ్ఛాపురం మండలం

ఇప్పటికే కిట్ల పంపిణీ..



కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా జిల్లాలో 440 మంది దళిత రైతులను గుర్తించాం. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మెటీరియల్, వివిధ రకాల విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుంది.

– ఆర్.గడ్డమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ(ఎఫ్ఏసీ), శ్రీకాకుళం